
సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 3 । జనవరి । 2025



యంత్రాల బాట

సాగు ఖర్చు, కూలీల ఖర్చు పెరిగిపోవడంతో రైతులు వరిసాగులో యంత్రాల బాట పడుతున్నారు. గట్టులంకలు వేసేందుకు సైతం యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. 8లో ▸



లబ్ధి ఎవరికి?

నూజివీడు ట్రిపుల్ ఐటీలోకి బయటి ఆహార పదార్థాలను అధికారులు నిషేధించారు. ఫుడ్ కోర్టులో ఉన్న ఆహార పదార్థాలను విద్యార్థులకు అంటగడుతున్నారు. 8లో ▸



వేడుకలకు వెళ్లి..

కొత్త సంవత్సర వేడుకలను మిత్రులతో సరదాగా చేసుకుందామని గోవా వెళ్లిన యువకుడు హత్యకు గురికావడంతో తాడేపల్లిగూడెంలో విషాదఛాయలు అలముకున్నాయి. 8లో ▸

న్యూస్‌రీల్

211 మంది ఎంపిక



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ మూడవ రోజు కొనసాగింది. గురువారం ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మూడవరోజు దేహదారుఢ్య పరీక్షలకు భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఉదయం నుంచీ గ్రౌండ్స్‌లోనే ఉంటూ పోటీలను పర్యవేక్షించారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. ఎంపికలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 600 మంది పురుష అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు జారీ చేయగా 346 మంది మాత్రమే హాజరయ్యారని, వారిలో 211 మంది ఎంపికైనట్లు ఎస్పీ శివకిషోర్ చెప్పారు. అభ్యర్థులు ఎంపిక పోటీలకు హాజరయ్యే సమయంలో తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో రావాలని ఆయన తెలిపారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పోటీ పరీక్షల నిర్వహణలో ఉన్నారు.

సార్వత్రిక విద్యాపీఠం ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

భీమవరం: రాష్ట్ర సార్వత్రిక విద్యా పీఠానికి సంబంధించి టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి పరీక్ష రుసుం చెల్లించడానికి గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 6వ తేదీ వరకు అవకాశముందన్నారు. ఒక్క సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో 8వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో 9వ తేదీ వరకు, తత్కాల్ రుసుంతో 10వ తేదీ వరకు అవకాశముందని నారాయణ తెలిపారు.

కానిస్టేబుళ్ల భర్తీకి చర్యలు



సర్కిల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్, ఐజీ, కలెక్టర్

ఆకివీడు: కొత్తగా ఆరు వేల కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. ఆకివీడు మండలంలోని అజ్జమూరు గరువులో కొత్తగా నిర్మించిన పోలీస్ సర్కిల్ కార్యాలయ భవనాన్ని గురువారం ఆయన డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజుతో కలిసి ప్రారంభించారు. ఐజీ మాట్లాడుతూ పోలీసులు తక్కువగా ఉన్న స్టేషన్లలో కానిస్టేబుళ్లను నియమిస్తామని చెప్పారు. యండగండిలో పార్శిల్‌లో శవం కేసును తమ పోలీసులు చాకచక్యంగా ఛేదించారన్నారు. ఈ సందర్భంగా ఎస్సైలకు, సీఐలకు ప్రత్యేక మొమెంటోలను అందజేశారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు బీదా మస్తానరావు ఇచ్చిన రూ. కోటి సహాయంతో నియోజకవర్గంలోని నాలుగు పోలీస్‌స్టేషన్‌లకు వాహనాల్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం, ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ స్వచ్ఛంద పదవీ విరమణ



డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు

భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ మహేశ్వరరావు స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. ఆయన మరో ఏడేళ్ల సర్వీసు ఉండగానే వాలంటరీ రిటైర్మెంట్ ప్రకటించారు. వ్యక్తిగత కారణాల వల్ల ముందస్తుగా రిటైర్‌మెంట్ తీసుకున్నట్లు ఆయన చెబుతున్నప్పటికీ పని ఒత్తిడే కారణమని తెలుస్తోంది. డాక్టర్ మహేశ్వరరావు డీఎంహెచ్‌వోగా సమర్థవంతగా పనిచేశారు. గత ప్రభుత్వంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపులు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో ఆయన ఎంతో శ్రమించి కలెక్టర్, నాటి ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా భాను నాయక్

డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ మహేశ్వరరావు స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవడంతో ఆయన స్థానంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ భానునాయక్‌ను ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా కలెక్టర్ నాగరాణి నియమించారు.

సృజనకు సాన.. వైజ్ఞానిక ప్రదర్శన

విద్యార్థుల మేధకు పదును పెడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇప్పటికే గ్రామస్థాయిలో నిర్వహించగా గురువారం జిల్లా వ్యాప్తంగా మండల స్థాయిలో పోటీలు జరిగాయి. శనివారం వీరవాసరంలో జరుగనున్న జిల్లాస్థాయి పోటీలకు 60 ఎగ్జిబిట్స్ ఎంపికయ్యాయి.



మేధకు పదును

- ఆకట్టుకుంటున్న సైన్స్ ప్రదర్శనలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు
- మండల స్థాయిలో పోటీలు పూర్తి
- 4న జిల్లాస్థాయిలో పోటీలకు 60 ఎగ్జిబిట్స్ ఎంపిక

సాక్షి, భీమవరం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించేలా ప్రోత్సహించేందుకు విద్యాశాఖ ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తోంది. భౌతిక, రసాయనిక, గణిత, ఖగోళ, పర్యావరణ, జీవశాస్త్రాలు, ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో విద్యార్థులు వ్యక్తిగతంగా, బృందంగా పోటీపడవచ్చు. గతంలో జిల్లాస్థాయిలో మాత్రమే జరిగే ఈ పోటీలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, మండల స్థాయిలో నిర్వహణకు ఆదేశాలిచ్చింది. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల, వెల్ఫేర్ విభాగాల్లో ప్రైమరీ స్కూళ్లు 1,075 ఉండగా, అప్పర్ ప్రైమరీ 86, హైస్కూళ్లు 211 ఉన్నాయి. రెండురోజుల క్రితం గ్రామస్థాయిలో జరిగిన పోటీల్లో దాదాపు 1,850 మంది వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని వెయ్యికి పైగా ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. వీటిలో ప్రతిభావంతమైన ఎగ్జిబిట్స్ చొప్పున 633 ఎగ్జిబిట్స్‌తో గురువారం మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయికి మూడు ప్రదర్శనలు

మండల స్థాయిలో ఒక్కో మండలం నుంచి మూడు చొప్పున జిల్లాస్థాయి పోటీలకు మొత్తంగా 60 ఎగ్జిబిట్స్ ఎంపికయ్యాయి. ఈనెల 4న (శనివారం) వీరవాసరంలోని ఎమ్మార్కే జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమమైన మూడు ఎగ్జిబిట్స్‌ను రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపిక చేస్తారు.

జిల్లాస్థాయికి ఎంపికైన ఎగ్జిబిట్లలో కొన్ని..

యాప్‌తో కంట్రోల్

ఫోన్ యాప్ ద్వారా విద్యుత్ గృహోపకరణాలను కంట్రోల్ చేయవచ్చంటూ కాళ్ల మండలం కోపల్లె హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని ఎస్‌డీఎస్ఎస్ కనకదుర్గ తయారుచేసిన స్మార్ట్‌హోం ప్రదర్శన ఆకట్టుకుంది. యాప్ ద్వారా ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్లు, టీవీలు తదితర వాటిని ఎలా కంట్రోల్ చేయవచ్చనేది వివరించింది.

ఫైర్ డిటెక్టర్

వడలి హైస్కూల్ విద్యార్థులు ఫైర్ డిటెక్టర్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇంట్లో గ్యాస్ లీకైనప్పుడు దానిని డిటెక్టర్ పసిగట్టి ఎలా అలర్ట్ చేస్తుందో తెలియజేస్తూ.. అగ్నిప్రమాదాల నివారణకు ఇది దోహదపడుతుందని వివరించారు.

జల్లెడ యంత్రం

పోడూరు మండలం కొమ్ముచిక్కాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మల్టీపర్పస్ మెషీన్ (జల్లెడ యంత్రం) ప్రాజెక్టును రూపొందించారు. దీనిని వినియోగించి తక్కువ సమయంలో ఎక్కువ పరిమాణంలో ఇసుక, బియ్యం, పప్పులు తదితర వాటిని జల్లించవచ్చని వివరించారు.

కునుకు తీస్తే తట్టి లేపుతుంది



ఆటోమేటిక్ ఇండికేటర్ (స్లీప్ ఇన్ డ్రైవర్) ప్రాజెక్టుతో ఆకివీడు హైస్కూల్ విద్యార్థి కె.మణికంఠ కళ్లజోడును రూపొందించాడు. దీనిని పెట్టుకుని వాహనం నడిపినప్పుడు కునుకుతీస్తే వీటిలోని సెన్సార్ అలారం తట్టిలేపుతుంది. బ్యాటరీ, మైక్రో కంట్రోలర్, ఆర్ఎఫ్ ట్రాన్స్‌మీటర్, రిలే, లెడ్, ఐఆర్ సెన్సార్ (కన్ను)ను వినియోగించి దీనిని రూపొందించినట్టు మణికంఠ చెప్పాడు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇది దోహదపడుతుంది.

పాలీ షెడ్డుతో లాభాలెన్నో..



పాలీ షెడ్డుతో ఫార్మింగ్ ద్వారా నీటి వృథాను నియంత్రించవచ్చని వివరిస్తూ తణుకు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు తయారు చేశారు. పాలీ షెడ్డును ఉపయోగించి సాగు చేయడం ద్వారా అధికోత్పత్తిని సాధించవచ్చని వివరించారు.

వ్యర్థాలతో ఇంధనం



వ్యర్థాలను వినియోగించి ఇంధనం తయారుచేసే విధానాన్ని వివరిస్తూ అత్తిలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వర్కింగ్ మోడల్‌ను తయారుచేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను మండించి దాని నుంచి వచ్చే గ్యాస్‌ను కండెన్సేషన్ ద్వారా ద్రవరూపంలో మార్చడం ద్వారా ఇంధనం తయారీ గురించి వివరించారు.

అగ్నిప్రమాదాలు నివారించేలా..



ఉండి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఫైర్ అలారం అండ్ ఎక్సాస్టింగ్ సిస్టమ్‌ను రూపొందించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు సెన్సార్ ద్వారా అలారం మోగి ఆటోమేటిక్‌గా వాటర్ మోటార్ ఆన్ కావడం, ప్రమాద స్థలంలో వాటర్ స్ప్రేయింగ్ గురించి వివరించారు.

బోట్ నావిగేషన్ సిస్టమ్



వీరవాసరం హైస్కూల్ విద్యార్థులు బోట్ మిస్సింగ్ ట్రాకింగ్ సిస్టమ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. బోట్‌కు నావిగేషన్ సిస్టమ్‌ను అమర్చి సెల్‌ఫోన్‌కు అనుసంధానించడం ద్వారా నీట మునిగిన, జాడ తెలియకున్న బోటును ఎస్ఎంఎస్ రూపంలో గుర్తించే వీలుంటుందని తెలిపారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి

పారా లీగల్ వలంటీర్ల శిక్షణలో జిల్లా జడ్జి సోమశేఖర్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: పారా లీగల్ వలంటీర్లు మండల న్యాయ సేవా సంస్థకు, సామాన్య ప్రజలకు మధ్య వారధి లాంటివారని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎంఎ సోమశేఖర్ అన్నారు. ఉచిత సేవలందించడానికి మండల న్యాయసేవా సంస్థలో దరఖాస్తు చేసుకున్న పారా లీగల్ వలంటీర్లకు భీమవరంలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని అవసరమైన వారికి సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందజేయాలన్నారు. వలంటీర్లు వారి ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేయడంలో సహకరించి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడానికి ప్రయత్నం చేయాలన్నారు. వలంటీర్లు ధనాపేక్ష లేకుండా సంస్థకు కట్టుబడి పనిచేయాలని స్పష్టం చేశారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఏడాది కాలపరిమితితో ఇచ్చే గుర్తింపు కార్డులను సక్రమంగా వినియోగించాలని, దుర్వినియోగం చేసినట్టు సంస్థ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సోమశేఖర్ హెచ్చరించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి సురేష్‌బాబు, ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్‌కుమార్, బి.సునీల్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సమావేశం

భీమవరం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా సమావేశం శుక్ర వారం ఉదయం 10 గంటలకు పెదఅమిరం గ్రామంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు బంధన పూర్ణచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సోషల్ మీడియా విభాగం బలోపేతానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా హాజరవుతారని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పశువధకు ఎమ్మెల్యే రాధాకృష్ణే సూత్రధారి

మాజీ మంత్రి కారుమూరి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పశువధ కర్మాగారం నుంచి అందిన డబ్బుకు దాసోహం కావడంతోనే మండలంలోని తేతలిలో లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థ అక్రమంగా పశువధ నిర్వహిస్తోందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డబ్బుకు లొంగిపోయిన ఎమ్మెల్యే రాధాకృష్ణ ఓట్లేసి గెలిపించిన మహిళలను రోడ్డుపై కూర్చోబెట్టి వారి జీవనాన్ని హరించారని విమర్శించారు. 2014 నుంచి 2019 లోపు ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతులు, సివిల్ పనులు, సాంకేతిక సామర్థ్యాన్ని ఏర్పాటుచేసుకున్నామని, కూటమి ప్రభుత్వం ఫ్యాక్టరీ ద్వారా వ్యాపారాన్ని పెంచాలని, తద్వారా రెవెన్యూ వస్తుందని, ఉపాధి పెరుగుతుందని తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నట్టు ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ ప్రకటించారని విమర్శించారు. ఇళ్లలో ఉండలేకపోతున్నామని, పిల్లలు అనారోగ్యాల పాలవుతున్నామంటూ మహిళలు ఆవేదన చెందుతున్నా ఎమ్మెల్యేకు పట్టడం లేదన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా ఏ గ్రామంలో కూడా ప్రైవేటు ఫ్యాక్టరీలు నడిచే వ్యవస్థ లేదని చట్టాలు చెబుతున్నా కనీసం ఆ జ్ఞానం కూడా ఎమ్మెల్యేకు లేకపోవడం శోచనీయమని అన్నారు. ఆరు నెలల్లోనే మీ నిజ స్వరూపం ప్రజలకు అర్థమయ్యిందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కూడా పశువధ జరిగిందని తప్పుడు పత్రాలు పుట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, కర్మాగారంలో ఎప్పుడు వధ జరిగిందో కరెంటు బిల్లులే నిదర్శనమని, జీఎస్టీ బిల్లులు కూడా తమ వద్ద ఉన్నాయని కారుమూరి అన్నారు. నాకు దమ్ము, ధైర్యం ఉన్నాయి కాబట్టే గతంలో ఫ్యాక్టరీని మూయించానని, మీకు దమ్ము, ధైర్యం ఉంటే ఇప్పుడు మాయించాలని ఆరిమిల్లికి సవాల్ విసిరారు. చంద్రబాబు కుయుక్తులతో గద్దెనెక్కారని, ఎమ్మెల్యే ఆరిమిల్లి ధోరణి కూడా అలానే ఉందని కారుమూరి అన్నారు. ఆనాడు నాకు ఫ్యాక్టరీలో వాటా ఉందని అబద్ధాలు వండివార్చారని, ఇప్పుడు తాను అడుగుతున్నా ఫ్యాక్టరీలో మీకు, మీ కుమారుడికి వాటాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. తణుకు నియోజకవర్గంలో ఏ పని కావాలన్నా ఆర్‌కే ట్యాక్స్ చెల్లించాల్సిదేనని ప్రజలు అంటున్నారని కారుమూరి విమర్శించారు.

పోరాటం ఆగదు

తేతలి గ్రామస్తుల కోసం అఖిలపక్షం, వివిధ సంఘాల తరఫున రానున్న రోజుల్లో పశువధపై ఉద్యమం చేయనున్నామని కారుమూరి అన్నారు. ఎవరెన్ని ఆటంకాలు కలిగించినా పోరాటం ఆగదన్నారు.

అనుమతులు సక్రమంగా లేవు

లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చూపిస్తున్న అనుమతులన్నీ అక్రమమని గోసేవా సమితి సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ అండతో అధికారులు చట్టాన్ని మీరి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తణుకు తహసీల్దార్, రూరల్ సీఐ వ్యవహారం కూడా అనుమానాస్పదంగా ఉందన్నారు. తాము చేపట్టిన నిరసన శిబిరం టెంట్లు తొలగించడంతో పాటు సామగ్రిని స్వాధీనం చేసుకోవడం చట్టవ్యతిరేకమన్నారు. ఇందుకు సహకరించిన అధికారులపై కేసులు పెట్టనున్నట్టు చెప్పారు. బాధిత మహిళలు మాట్లాడుతూ పరిశ్రమ వద్ద గత ఐదేళ్లలో ఎప్పుడూ దుర్వాసన రాలేదని, రెండు నెలలుగా దుర్వాసన రావడంతో ఆందోళనలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, గోసేవా సమితి సభ్యుడు జల్లూరి జగదీష్, పార్టీ నాయకులు వి.సీతారాం, మెహర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చొరబడ్డారు

గత ఏడాది జిల్లాలో పట్టపగలే చోరీలు ఎక్కువగా జరిగాయి. ఒంటరి మహిళలు, తాళం వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా దుండగులు దొంగతనాలకు పాల్పడ్డారు. మొత్తంగా 695 దొంగతనాలు జరగ్గా 350 కేసులను పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. సుమారు రూ.3 కోట్ల సొమ్మును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. కేసుల ఛేదనలో సీసీ ఫుటేజీలు కీలకంగా మారాయి.

- గత ఏడాది జిల్లాలో 695 చోరీలు
- రెండు ఘటనల్లో ఇద్దరు మహిళల హత్య
- రూ.6.78 కోట్ల సొత్తు అపహరణ
- పాలకొల్లు, తాడేపల్లిగూడెంలలో సంచలనం కలిగించిన చోరీలు
- భీమవరంలో బందిపోటు దోపిడీ యత్నాన్ని భగ్నం చేసిన పోలీసులు



పాలకొల్లులో వృద్ధురాలిపై దాడి జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్పీ నయీం అస్మి (ఫైల్)

సాక్షి, భీమవరం: గత ఏడాది జిల్లాలో 695 దొంగతనాలు జరిగాయి. వీటిలో 14 వరకు దోపిడీ కేసులు ఉంటే రెండు డెకాయిట్ కేసులు, కన్నపు నేరాలు 206, దొంగతనాలు 473 కేసులు ఉన్నాయి. రెండు కేసుల్లో ఇరువురు మహిళలు హత్యకు గురయ్యారు. మొత్తం రూ.6,78,44,821 సొత్తును దుండగులు అపహరించారు. ఒంటరి మహిళలు, తాళం వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా దొంగతనాలు ఎక్కువగా జరిగినట్టు పోలీసులు గుర్తించారు. దుండగులు ముందుగా రెక్కీ నిర్వహించడం ద్వారా ఆయా ఇళ్లలో చాలావరకు పట్టపగలే చోరీలకు పాల్పడ్డారు. మహిళల మెడ నుంచి గొలుసులు అపహరించే చైన్ స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. మోటారు సైకిళ్ల దొంగతనాలు, మోటారు సైకిళ్ల డిక్కీలు, కార్లలో ఉంచిన నగదు, బంగారం చోరీలు ఉన్నాయి. ఇక సైబర్ నేరగాళ్లు విజృంభించి అనేక మంది బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ములు మాయం చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ప్రముఖ వైద్యుడిని బురిడీ కొట్టించి రూ.70 లక్షలు కాజేయడం భీమవరంలో సంచలనం సృష్టించింది.

350 కేసులను ఛేదించిన పోలీసులు : సంఘటన స్థలం నుంచి క్లూస్‌టీంలు సేకరించిన వేలిముద్రలు, ఆధారాలు, పోలీస్ జాగిలాల ద్వారా సేకరించిన ఆధారాలు, సీసీ పుటేజీల పరిశీలన, నేరం జరిగిన తీరును బట్టి ఆ తరహాలో నేరాలకు పాల్పడే పాత నేరస్తులను గుర్తించడం, తదితర కోణాల్లో 350 కేసులను జిల్లా పోలీస్ యంత్రాంగం ఛేదించింది. రూ.3,05,61,807 సొమ్మును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. మునుపటి ఏడాదితో పోలిస్తే గత ఏడాది కేసుల సంఖ్య తగ్గడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో త్వరితగతిన కేసుల పరిష్కారం, పురోగతి ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. చోరీ ఘటనల్లో 45 శాతం సొత్తును బాధితులకు అప్పగించినట్టు తెలిపారు. సీసీ పుటేజీల ద్వారా ఆధారాలు లభ్యమైన కేసుల్లో పురోగతి వేగంగా ఉంటే అవి లేని చోట ఆలస్యమవుతున్నట్టు గుర్తించారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా స్థానికులను చైతన్యవంతుల్ని చేస్తున్నారు. సైబర్ నేరాలు జరిగే తీరు, వాటి బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

జిల్లాలో నేరాల సంఖ్యను తగ్గించగలిగాం



సమర్థవంతమైన పోలీసింగ్, సమష్టి కృషితో మునుపటి కంటే గతేడాది నేరాల సంఖ్యను తగ్గించగలిగాం. చాలా కేసులను తక్కువ వ్యవధిలోనే ఛేదించడం ద్వారా నిందితులను అరెస్టు చేశాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపాం. జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు గూర్చి అవగాహన కల్పించాం. మహిళలు, చిన్నారుల భద్రత కోసం మహిళ రక్షక్ టీమ్స్ ఏర్పాటుచేశాం.

– అద్నాన్ నయీం అస్మి, ఎస్పీ, పశ్చిమగోదావరి జిల్లా

- **29 జూలై 2024:** పాలకొల్లు పట్టణ నడిబొడ్డున బొండాడ వారి వీధిలో నివసిస్తున్న వృద్ధురాలు కలిశెట్టి అనసూయ ఇంటిలోకి మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఇద్దరు దుండగులు చొరబడ్డారు. ఆమెపై అత్యాచార యత్నానికి ఒడిగట్టి తలపై రాయితో దాడిచేశారు. ఇంటిలోని ఎనిమిది కాసుల బంగారు వస్తువులను చోరీచేశారు. సీసీ టీవీ పుటేజీ ఆధారంగా పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. తీవ్రగాయాలతో నెలరోజుల పాటు ఆమె ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి తనువు చాలించింది.
- **5 సెప్టెంబరు 2024:** తాడేపల్లిగూడెం పట్టణం 4వ వార్డులోని ఇంటిలో ఒంటరిగా నివసిస్తున్న బొబ్బిలి దేవి (50)ని హత్యచేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారం గొలుసు, ఉంగరాలు, ఇంటిలోని నగదును ఎత్తుకెళ్లారు. సీసీ టీవీ పుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు తక్కువ వ్యవధిలోనే ఘాతుకానికి పాల్పడిన నిందితున్ని అరెస్టు చేశారు.
- **23 నవంబరు 2024:** భీమవరంలోని ఒక ఇంటిలో భారీ చోరీకి ప్రణాళిక సిద్ధం చేసుకున్న దోపిడీ దొంగల ముఠాను భీమవరం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న 12 మంది ముఠా సభ్యుల్లో ముగ్గురు పరారవ్వగా, తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఇనుపరాడ్లు, కత్తులు, తాళ్లను స్వాధీనం చేసుకోవడం స్థానికంగా సంచలనం కలిగించింది.
- **16 డిసెంబరు 2024:** తాడేపల్లిగూడెంలో దంపతులు బంగారం, వెండి హోల్‌సేల్ వ్యాపారం పేరుతో జిల్లాలో 33 మంది వ్యాపారులను మోసగించి రూ.85 లక్షలు విలువచేసే ఆరు కేజీల బంగారం, 106 కేజీల వెండి వస్తువులను కాజేసి పరారవ్వడం సంచలనమైంది. నిందితుల కాల్‌డేటా ఆధారంగా పోలీసులు వారు ఉన్న లొకేషన్‌ను గుర్తించి అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

తెలుగు మహాసభల తీర్మానాలను వ్యతిరేకిస్తున్నాం



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు రచయితల మహాసభల తీర్మానాలను వ్యతిరేకిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటి మిల్లి మంగరాజు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని మసీద్ సెంటర్ వద్ద గురువారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ తెలుగు వికాసం ముసుగులో బడుగు, బలహీన వర్గాల పిల్లల జీవితాలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం రద్దును ఖండిస్తున్నామని వెల్లడించారు. తెలుగు వికాసం పేరుతో వేదికల మీద మాట్లాడిన పెద్దల పిల్లలు అమెరికాలో చదువుకోవాలా? మంచిగా స్థిరపడాలా? అంటూ ప్రశ్నించారు. బడుగు, బలహీన, పేద, మధ్య తరగతి పిల్లలు మాత్రం తెలుగులో చదవుకోవాలా? అని ప్రశ్నించారు. ప్రతి పాఠశాలలో తెలుగు మీడియం, ఇంగ్లిషు మీడియం రెండు తప్పక ఉండాలని, మీడియం నిర్ణయం తల్లిదండ్రులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ కోఆప్షన్ సభ్యులు మహమద్ షఫీ ఉరెహ్మాన్ ఖురేషి, మహమద్ ఖలీలూర్ రెహ్మాన్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ విజేతకు అభినందనలు



గంగాధరరావును అభినందిస్తున్న కలెక్టర్

ఏలూరు (మెట్రో): విజయవాడ ఫన్ టైం క్లబ్ ఇండోర్ ఆడిటోరియంలో జరిగిన 9వ ఏపీ స్టేట్ మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఏలూరు నివాసి చిట్టెల గంగాధరరావు 70 ప్లస్ పురుషుల విభాగంలో చాంపియన్ గెలవడం ద్వారా యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. ఇటీవల విజయవాడ ఫన్ టైం క్లబ్ ఇండోర్ ఆడిటోరియంలో నిర్వహించిన 9వ ఏపీ స్టేట్ మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో వెటరన్ విభాగంలో విజేతగా నిలిచిన గంగాధరరావు గురువారం జిల్లా కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనను అభినందించారు. తాను ఈ టోర్నమెంట్‌తో పాటు డిసెంబర్ 8న విశాఖపట్నం రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలోనూ, డిసెంబర్ 1న విశాఖపట్నం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలో వెటరన్ టేబుల్ టెన్నిస్ సింగిల్ విభాగంలో పాల్గొని విజేతగా నిలిచానని గంగాధరరావు కలెక్టర్‌కు తెలియజేశారు.

చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తికి జైలు

నూజివీడు: చెక్ బౌన్స్ కేసులో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పుచెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన షేక్ చాందిని బాపులపాడు మండలం సీతారామపురానికి చెందిన దారా రామకిషోర్ వద్ద 2021 ఏప్రిల్ 4న రూ.3 లక్షలను అప్పుగా తీసుకుంది. కొంతకాలం తరువాత తన బాకీ చెల్లించాల్సిందిగా రామకిషోర్ చాందినీని అడగ్గా ఆమె రూ.3 లక్షలకు చెక్కును ఇచ్చారు. ఈ చెక్కును రామకిషోర్ బ్యాంకులో వేయగా చాందీని అక్కౌంట్‌లో నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. దీంతో రామకిషోర్ కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం చాందినీకి ఆరు నెలల జైలుశిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

వరిసాగులో యంత్రాల బాట

గట్టు లంకలకూ యంత్రాలే వినియోగం



దాళ్వా వరినాట్లు వేయడానికి యంత్రంతో గట్టు వేస్తున్న దృశ్యం



భీమవరం: రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం సాగుకు పెట్టుబడి సాయం అందించకపోవడం, పంటల బీమా ప్రీమియం చెల్లింపులోనూ చేతులెత్తేయడంతో రైతన్నలు సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు యంత్రాల బాట పడుతున్నారు. ఇప్పటికే కూలీలు, సాగు ఖర్చు పెరగడంతో వరిసాగులో రైతులు మీనమేషాలు లెక్కిస్తున్న పరిస్థితి. అయితే వ్యవసాయమే జీవనాధారమైన జిల్లాలో వరిసాగును వదులుకోలేక పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోడానికి రైతన్నలు ఎక్కువగా యంత్రపరికరాలను వినియోగిస్తున్నారు. దీనిలో భాగంగానే ఇప్పటికే వరినాట్లు, మాసూళ్లు, పురుగు మందులు పిచికారీ వంటివాటికి యంత్రాలను ఉపయోగిస్తుండగా ఇటీవల వరి చేలల్లో గట్టులంకలు వేసి పటిష్టంగా గట్టు వేయడానికి యంత్రాన్ని వినియోగిస్తున్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో దాళ్వా వరిసాగు చేయాల్సి ఉండగా తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు తదితర ప్రాంతాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి, మిగిలిన ప్రాంతాల్లో రైతులు దుక్కులు చేయిస్తూ గట్టులంకలు వేయించే పనిలో నిమగ్నమయ్యారు.

వరిసాగులో యంత్రాలకే ప్రాధాన్యత

జిల్లాలోని 20 మండలాల్లోని రైతులు గత పదేళ్లుగా వరినాట్లు, నూర్పిడి, పురుగు మందుల పిచికారీ వంటివాటికి యంత్ర పరికాలను వినియోగిస్తున్నారు. ఒక ప్రత్యేక పద్ధతిలో వరినాట్లు వేయడానికి ముందుగానే ట్రేలలో నారుమడి వేసుకుని నారుమడి వేసిన కేవలం 15 రోజులు లోపుగానే నాట్లు వేయడంతో విత్తనాలు ఖర్చు తగ్గడమేగాక తక్కువ సమయంలో నాట్లు వేయడం, కూలీల ఖర్చు తగ్గడంతో ఎక్కువ మంది రైతులు నాట్లు వేసే యంత్రాలను వినియోగిస్తున్నారు. అలాగే కలుపు నివారణ, పురుగులు మందు పిచికారీకి సైతం యంత్రాలనే ఉపయోగిస్తుండగా పంట మాసూళ్లకూ యంత్రాలనే ఉపయోగిస్తున్నారు.

కొత్తగా గట్టు లంకలు వేసే యంత్రం వినియోగం

ఇటీవల వరినాట్లు వేయడానికి భూమిని దుక్కుచేయడం, గట్టులంకలు వేయడానికి నూతన యంత్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు. గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక యంత్రంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు గట్టులంకలు వేస్తూ గట్టులను పటిష్టం చేయిస్తున్నారు.

లంకలు వేయడానికి గంటకు రూ.2,500

వరిచేలలో గట్టులంకలు వేయడానికి గట్టును పటిష్టం చేయడానికి యంత్రానికి గంటకు రూ.2,500 వసూలు చేస్తున్నారు. ఎకరం చేనులో లంకలు వేయడానికి 15 నిమిషాల సమయం పడుతుందని ఎకరాకు రూ.650 ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటివరకు చేలల్లో పంట దమ్ము చేయడానికి ట్రాక్టర్లు వినియోగించడంతో దమ్ము చక్రాలతో గట్లపై తిరగడం వల్ల గట్టు బలహీనపడడంతో ఇబ్బందులు పడుతున్నామని గట్టులంకల యంత్రం వినియోగంలోకి రావడం వల్ల త్వరితగతిన పని పూర్తికావడమేగాక గట్టు పటిష్టమవుతుందని చెబుతున్నారు.

సమయం, ఖర్చు ఆదా



వరిసాగులో యంత్రాలు వినియోగం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడంతోపాటు సమయం కలిసి వస్తుండడంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. గట్లు లంకల యంత్రం వల్ల త్వరితగతిన పని పూర్తి కావడమేగాక గట్టు పటిష్టమై చేలల్లోని నీరు బయటకు వెళ్లే అవకాశం ఉండదు.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

యంత్రాలు లేకుంటే కష్టమే




వరిసాగులో యంత్రాల వినియోగం వల్లనే పంట పండించగలుగుతున్నాం. కూలీల కొరత తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో యంత్రాలు లేకుంటే వరిసాగు కష్టమే. గట్టు లంకల యంత్రం వినియోగం వల్ల ఖర్చు తగ్గడమేగాక గట్లు పటిష్టమవుతున్నాయి.

– పంజా శేషగిరిబాబు, రైతు, ముగ్గుళ్ల

నిషేధం పేరుతో లబ్ధి ఎవరికి ?

- బయట ఆహార పదార్థాలపై నిషేధం విధించిన ట్రిపుల్ ఐటీ అధికారులు
- ఫుడ్ కోర్టు నిర్వాహకులకు లబ్ధి చేసేలా అధికారుల తీరు



నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలోకి బయటి ఆహార పదార్థాలను విద్యార్థులు తెచ్చుకోవడానికి వీల్లేదంటూ నిషేధం విధించారు. రుచిగా ఉన్నా లేకపోయినా ఫుడ్ కోర్టులో లభించే ఆహార పదార్థాలను తినాల్సిందే అన్నట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఫుడ్ కోర్టులో ఉన్న ఆహార పదార్థాలను విద్యార్థులకు బలవంతంగా అంటగట్టేలా అధికారుల తీరు ఉండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఫుడ్ కోర్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తర్వాత అప్పటివరకు ఉన్న వారిని తొలగించి వేరే వారికి అప్పగించారు. ఫుడ్ కోర్టులో టిఫిన్ సెక్షన్‌తో పాటు బిర్యానీ, శీతల పానియాలు లభిస్తాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీకి సంబంధించి 6,352 మంది విద్యార్థులు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి చెందిన 1,715 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. వీరంతా మెస్‌లలో పెట్టే టిఫిన్, భోజనాన్ని తీసుకుంటూనే ఇంకా ఏమైనా కావాలనుకుంటే ఫుడ్ కోర్టులో కొనుగోలు చేస్తుంటారు.

ఉన్నతాధికారులు చెప్పినా..

ఫుడ్ కోర్టులో బిర్యానీలు, ఇతర ఆహార పదార్థాల ధరలు ఎక్కువ అనిపించినా.. ఆహారం బాగోకపోయినా..లేక పుట్టినరోజుల సమయంలోనైనా.. విద్యార్థులు అవుటింగ్‌కు వెళ్లినప్పుడు గానీ, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థల ద్వారా బిర్యానీలు, కేక్‌ల వంటి తినుబండారాలను బయటి నుంచి తెప్పించుకుంటారు. ఇలా గతం నుంచి విద్యార్థులు బయట ఫుడ్ తెచ్చుకుంటుండగా ఇది వరకూ ఫుడ్‌కోర్టు నిర్వాహకులు సైతం అడ్డు చెప్పారు. ఈ విషయాన్ని గతేడాది సెప్టెంబరులో ట్రిపుల్ ఐటీకి వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి దృష్టికి, కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్‌ల దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేసి ఏం తినాలనేది విద్యార్థుల ఇష్టమని, వారు తినాల్సిన ఆహార పదార్థాలపై ఎవరి పెత్తనం ఉండాల్సిన పని లేదని స్పష్టం చేశారు. అప్పటి నుంచి బయటి నుంచి తెచ్చుకునే ఆహార పదార్థాలపై ఎలాంటి అభ్యంతరాలు పెట్టడం లేదు. అయితే ఇటీవల కొద్దిరోజుల నుంచి బయటి ఆహార పదార్థాలను క్యాంపస్‌లోకి తెచ్చుకోవడాన్ని ట్రిపుల్ ఐటీ అధికారులు నిషేధించారు. ఇలా చేయడంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా ఫుడ్‌కోర్టు నిర్వాహకులకు లాభం కలిగించేందుకేనని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తాము తింటున్న ఆహారంపై నిషేధాన్ని ఎత్తివేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

తాత్కాలికంగా మాత్రమే నిషేధం

ట్రిపుల్ ఐటీలో రెండు నెలల్లో 150 వరకు లూజ్ మోషన్స్ కేసులు, 130 కడుపులో నొప్పితో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెలాఖరు వరకు మాత్రమే తాత్కాలికంగానే నిషేధం విధించాం. మెస్‌ల్లో ఫుడ్ వల్ల లేక ఫుడ్‌కోర్టులో ఫుడ్ వల్ల లేక బయట ఫుడ్ వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయనే విషయం తెలుసుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం.

–బి.లక్ష్మణరావు, ఏఓ, ట్రిపుల్ ఐటీ, నూజివీడు

ఆధునిక టెక్నాలజీతో ఆక్వాసాగు



కలగంపూడిలో ఆక్వా చెరువులను పరిశీలిస్తున్న ఫిషరీష్ కమిషనర్ టి.డోలా శంకర్

యలమంచిలి: ఆక్వా రైతులు ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని ఆక్వా సాగులో అధిక లాభాలు సాధించవచ్చునని ఫిషరీష్ కమిషనర్ టి.డోలా శంకర్ చెప్పారు. కలగంపూడి గ్రామంలో ఉయ్యూరు పద్మనాభరాజు అనే రైతు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) రియల్ టైం వాటర్ క్వాలిటీ ఎనలైజర్ అండ్ ఫాం ఆటోమేషన్ ద్వారా సాగు చేస్తున్న చెరువును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు ఈ పరికరం 20 రోజుల క్రితమే తన చెరువులో అమర్చినట్లు చెప్పారు. ఈ పరికరం ఎప్పటికప్పుడు చెరువులో ఆక్సిజన్, పీహెచ్, అమోనియా నైట్రోజిన్ స్థాయిలను సూచిస్తుందన్నారు. గతంలో రాత్రి సమయంలో చెరువులో ఆక్సిజన్ స్థాయిలు తగ్గకుండా ఉంచేందుకు సుమారు 12 గంటలపాటు ఏరియేటర్స్ వాడానన్నారు. కానీ పరికరం అమర్చిన తరువాత ఆరు గంటల మాత్రమే ఏరియేటర్స్ వేస్తున్నట్లు రైతు చెప్పారు. దీని వల్ల 30 శాతం వరకు విద్యుత్ ఆదా అవుతుందన్నారు. అంతే కాకుండా చెరువులో ఆక్సిజన్, పీహెచ్, అమోనియా నైట్రోజిన్ స్థాయిలను ఎప్పటికప్పుడు తన సెల్ ఫోన్‌కు మెస్సేజ్‌లు పంపుతుందన్నారు. దీని వల్ల ఎక్కడ ఉన్నా చెరువులో ఎలా ఉందో అనే టెన్షన్ తగ్గిందన్నారు. రైతు అనుభవాలను విన్న తరువాత ఫిషరీస్ కమిషనర్ టి.డోలా శంకర్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో 5.70 లక్షల ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం 4800 ఎకరాల్లో ఈ పరికరం వాడుతున్నట్లు వివరించారు. ఈ పరికరాన్ని ఆక్వా రైతులంతా వాడాలని సూచించారు. ఈ పరికరాన్ని రైతులకు సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తానన్నారు. ఆయన వెంట ఫిషరీస్ స్టేట్ జేడీ లాల్ మహ్మద్, డిస్ట్రిక్ జేడీ ప్రసాద్, ఏడీ ఎల్ఎల్ఎన్ రాజు, సలాది గోపికృష్ణ తదితరులు ఉన్నారు.

వేడుకలకు వెళ్లి.. విగతజీవిగా మారి

- గోవాలో యువకుడి హత్య
- తాడేపల్లిగూడెంలో విషాదఛాయలు



రవితేజ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



తలకు బలమైన గాయమైన రవితేజకు సపర్యలు చేస్తున్న మిత్ర బృందం

తాడేపల్లిగూడెం: కొత్త సంవత్సర వేడుకలను మిత్రులతో సరదాగా చేసుకుందామని గోవా వెళ్లిన యువకుడు హత్యకు గురికావడంతో తాడేపల్లిగూడెంలో విషాదఛాయలు అలముకున్నాయి. పట్టణానికి చెందిన బొల్లా రవితేజ (28) గోవాలోని మేరీనా షాక్ హోటల్‌లో జరిగిన ఘర్షణలో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో హోటల్ నిర్వాహకులపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోటల్ సిబ్బంది పర్యాటకులతో ఇలానే ప్రవర్తిస్తారని, వారిపై ఇప్పటికే నాలుగు కేసులు నమోదైనట్టు సమాచారం. ఇదిలా ఉండగా రవితేజతో పాటు గోవా వెళ్లిన నలుగురు యువకులు, ముగ్గురు యువతుల వివరాలు తెలియాల్సి ఉంది. అయితే మిత్ర బృందంలోని సత్యవర్షిణి అనే యువతి ఘటన మొత్తాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడంతో విషయం వెలుగు చూసింది. గోవా టీమ్‌లో పాలకొల్లుకు చెందిన ఓ యువకుడు ఉన్నట్టు భావిస్తున్నారు. అలాగే ఓ యువతిది తాడేపల్లిగూడెం, మరో యువతిది తాడేపల్లిగూడెం మండలం మాధవరం అని సమాచారం. వీరంతా హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్నట్టు తెలిసింది. ఉద్యోగపరమైన సాన్నిహిత్యంతోనే రవితేజ మిత్రులతో కలిసి గోవా వెళ్లి ఇలా విగతజీవిగా తిరిగి వచ్చాడని కుటుంబసభ్యులు బోరుమంటున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు ఆయన ద్వారా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు తెలియజేయగా.. గోవా ప్రభుత్వంతో కేంద్ర మంత్రి మాట్లాడి మృతదేహాన్ని ప్రత్యేక విమానంలో విజయవాడకు, అక్కడి నుంచి అంబులెన్స్‌లో గురువారం తాడేపల్లిగూడెం తీసుకువచ్చారు. ఇదిలా ఉండగా ఘటనపై తాడేపల్లిగూడెం పోలీసులను సంప్రదిస్తే ఎలాంటి సమాచారం లేదంటున్నారు.

2 గంటలపాటు కొట్టుమిట్టాడి..

ఘర్షణ సమయంలో మిత్ర బృందంపై హోటల్‌కు చెందిన 14 మంది దాడి చేయగా.. రవితేజ తీవ్రంగా గాయపడ్డాడు. రెండు గంటలపాటు కొన ఊపిరితో కొట్టుమిట్టాడాడని బంధువులు అంటున్నారు. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రాణం పోయిందని వాపోతున్నారు. రవితేజ తండ్రి సుబ్రహ్మణ్యం లారీ మెకానిక్‌గా పనిచేస్తున్నారు.

నలుగురి అరెస్టు

నార్ గోవాలోని కలంగూట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనకు సంబంధించి హోటల్ యజమాని కొడుకు సిల్వేరా, రవితేజ, స్పందన్ అనే వారిని అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. ఫుడ్ ఆర్డర్, బిల్లు విషయంలో తగాదా రవితేజ ప్రాణం పోవడానికి కారణమైందని పోలీసులు నిర్ధారించారు. మిత్ర బృందంలోని మిగిలిన సభ్యులు అందుబాటులోకి వస్తే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.

టౌన్ ప్లానింగ్ అధికారి ఆత్మహత్యాయత్నం

ఆకివీడు : స్థానిక నగర పంచాయతీలో పనిచేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ గురువారం సాయంత్రం కార్యాలయ ఆవరణలో ఆత్మహత్యాయత్నం చేశారు. ఒంటిపై పెట్రోల్ పోసుకుని కార్యాలయం ముందు హడావుడి చేయడంతో తోటి ఉద్యోగులు, కమిషనర్ జి.కృష్ణమోహన్ ఆందోళనకు గురయ్యారు. తనకు సిబ్బందిని నియమించాలని కమిషనర్‌ను, మేనేజర్‌ను కోరడంతో పై అధికారులతో కాన్ఫరెన్స్‌లో ఉన్నామని, వారి దృష్టికి తీసుకువెళ్లతామని చెప్పారు. దీంతో ఆయన వెంటనే కమిషనర్ రూము నుండి బయటకు వచ్చి తన వాహనంలో ఉన్న పెట్రోల్ సీసాను తీసుకుని ఒంటిపై పోసుకోవడంతో అక్కడున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అతన్ని వారించే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని వెంటనే కమిషనర్ స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే టౌన్ ప్లానింగ్ అధికారికి, కమిషనర్, మేనేజర్‌ల మధ్య ఇంకేమైనా గొడవలున్నాయా? అనే అనుమానాన్ని పట్టణవాసులు వ్యక్తంచేస్తున్నారు. తనకు సిబ్బందిని ఇవ్వకపోతే ఆత్మహత్యాయత్నం చేస్తారా? అని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం



అటవీ ప్రాంత విస్తీర్ణ వివరాలను అడిగి తెలుసుకుంటున్న రేంజ్ అధికారి శివరామకృష్ణ

బుట్టాయగూడెం : అడవి తల్లి ఒడిలో ఉన్న ఏ ఒక్క మొక్క, చెట్టునైనా కూడా బయటకు అక్రమ రవాణా చేయకుండా ఉక్కుపాదం మోపి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని కన్నాపురం రేంజ్ అధికారి ఎ.శివరామకృష్ణ అన్నారు. మండలంలోని అటవీ ప్రాంతంలో గురువారం సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు వ్యవసాయం పేరుతో పలు చోట్ల అడవులను నరికినట్లు శాటిలైట్ ద్వారా గుర్తించామని చెప్పారు. కన్నాపురం రేంజ్ పరిధిలో 18 వేల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని చెప్పారు. ఎవరైనా అడవిలోని చెట్లను అక్రమంగా నరికే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొగాకు బ్యారన్‌లకు సంబంధించి అడవి పుల్ల అక్రమంగా రవాణా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే పొగాకు బ్యారన్‌లు కలిగిన రైతుల వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. దీనికి సంబంధించి పొగాకు బోర్డు ఆర్ఎం నుంచి వివరాలు కూడా తీసుకుంటున్నామని, అక్రమ రవాణా విషయంలో బ్యారన్ లైసెన్స్‌దారులు ఉంటే ఆ లైసెన్స్ రద్దయ్యే విధంగా సిఫార్సు కూడా చేస్తున్నట్లు చెప్పారు. బుట్టాయగూడెం మండలం మెరకగూడెం నర్సరీలో 2,25,000 మొక్కలను కంపా పథకంలో పెంచుతున్నట్లు చెప్పారు. నారేప, జెట్రేపి, నేరేడు, తదితర అడవిజాతి మొక్కలను పెంచి వాటిని అన్ని ప్రాంతాల్లో పెంచే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా రాజవరంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో 50 వేల మొక్కలు పెంచే విధంగా ప్రతిపాదనలు అప్రూవల్ అయినట్లు చెప్పారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

నూజివీడు: బైక్ ఢీకొని మండలంలోని మొర్సపూడికి చెందిన కొలకలూరి మరియమ్మ (54) అనే మహిళ మృతి చెందింది. అనారోగ్యంగా ఉండటంతో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంజక్షన్ చేయించుకునేందుకు గానూ డాక్టర్ వద్దకు వెళ్లేందుకు మెయిన్‌రోడ్డుపై ఉంది. అయితే అటుగా వెళ్తున్న బైక్ ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. ప్రమాదంలో మరియమ్మకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆమెను హుటాహుటిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరియమ్మ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయగా, పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఫ్లిప్‌కార్ట్ బ్రాంచ్‌లో చోరీ

రూ. 3,73,592 నగదు అపహరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని ఫ్లిప్‌కార్ట్ బ్రాంచ్‌లో చోరీ ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం అయ్యప్ప టౌన్‌షిప్‌లో ఉన్న ఫ్లిప్‌కార్ట్ బ్రాంచ్‌లో డిసెంబర్ 31వ తేదీ రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బ్రాంచ్ షట్టర్ తాళాలు పగులగొట్టి లాకర్‌లో ఉన్న రూ. 3,73,592 నగదు దొంగిలించారు. ఘటనపై బ్రాంచ్ రీజనల్ మేనేజర్ పి.డి.వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌జబీర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెదవేగి: అతివేగం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేగివాడ గ్రామానికి చెందిన కోడూరి కార్తీక్ ఈ నెల 1న తన స్నేహితుడైన బుడపన ఉదయ వెంకట్‌తో మోటార్ సైకిల్‌పై అతివేగంగా డ్రైవ్ చేయడంతో అదుపుతప్పి పడిపోయారు. ప్రమాదంలో కార్తీక్‌కు తలకు బలమైన గాయం కాగా విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోడూరి కార్తీక్(18) గురువారం మృతి చెందాడు. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామివారి తిరువీధి సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవమూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామి వారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

కత్తులతో దాడి

ఆగిరిపల్లి: రుణ వసూలు విషయంలో తలెత్తిన వివాదంతో ఇద్దరు వ్యక్తులు ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకుని గురువారం వట్టిగుడిపాడు గ్రామంలో వీరంగం సృష్టించారు. వివరాల ప్రకారం నూజివీడు మండలం పొనసానపల్లికి చెందిన వేముల గోపాలస్వామి కొబ్బరి తోటల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రామన్నగూడేనికి చెందిన రాణిమేకల శ్యామ్ కుమార్, గోపాలస్వామి దగ్గర రూ.50 వేల విలువైన కొబ్బరికాయలను అప్పుగా తీసుకుని చెల్లించలేదు. గురువారం రాత్రి వట్టిగుడుపాడులోని మద్యం దుకాణం వద్ద గోపాలస్వామి డబ్బుల కోసం శ్యామ్‌కుమార్‌ను నిలదీయడంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో పక్కనే ఉన్న కొబ్బరి బొండాలు నరికే కత్తితో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఇద్దరికీ గాయాలు అవడంతో స్థానికులు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై శుభశేఖర్ ఇరువురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కైకలూరు సర్పంచ్ ప్రవర్తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు సర్పంచ్‌పై ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ కాంట్రాక్టు సిబ్బంది

కైకలూరు: కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి వ్యక్తిగతంగా కుటుంబ సభ్యులను సైతం దూషిస్తున్నారని పంచాయతీ కార్యాలయం కాంట్రాక్టు సిబ్బంది తహసీల్దారు కార్యాలయంలో కలెక్టర్ వెట్రిసెల్వికి గురువారం వినతిపత్రాన్ని అందించారు. వివిధ శాఖల జిల్లా, నియోజకవర్గ అధికారులతో సమీక్ష సమావేశం నిమిత్తం వచ్చిన కలెక్టర్ వద్ద సర్పంచ్ ఆమె భర్త ప్రసాద్ వల్ల మానసిక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు పలువురు నీటి కుళాయిలు, పంచాయతీ నిధుల ఖర్చులపై సర్పంచ్ భర్తపై మరో ఫిర్యాదు ఇచ్చారు. దీంతో కలెక్టర్ సంబంధిత ఫిర్యాదులపై విచారణ చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రామప్రసాద్ కైకలూరులో పూర్వం కొనసాగించిన నాంది వాటర్ స్కీం పునరుద్ధరణ, పలు కూడళ్లలో సులభ్ కాంప్లెక్సులు నిర్మించాలని వినతిపత్రం అందించారు. కలిదిండి మండలం తాడినాడకు చెందిన పలువురు రైతులు ఆక్వా జోనల్ వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. చేపల రైతు సంఘ నేతలు ఫిషరీస్ సంఘ హాలుకు స్థలం కేటాయించాలని వినతిపత్రం అందించారు.

క్లుప్తంగా

ఐలు క్యాలెండర్ ఆవిష్కరణ



తణుకులో ఐలు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రూపొందించిన క్యాలెండర్ గోడ పత్రికను మండల న్యాయసేవా సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదులు, కక్షిదారులకు ఐలు గోడపత్రిక దిక్సూచిగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 27 అర్జీలు



జగ్గన్నపేట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సు దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల ప్రాముఖ్యతను వివరించారు. జగ్గన్నపేట సదస్సులో 16, వెంకట్రామన్నగూడెం సదస్సులో 11 వెరసి 27 అర్జీలు అందాయని తహసీల్దార్ సునీల్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వి.సుబ్బారావు, జి. చంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



తణుకులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ

తణుకు అర్బన్: ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముర్ల చిన్న అనే వ్యక్తిని అరెస్టుచేసి అతని నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. గురువారం నిర్వహించిన దాడుల్లో భాగంగా సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆర్.మదుబాబు, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీమన్నారాయణ, కానిస్టేబుల్ కె.నాగరాజు పాల్గొన్నారు.

నేడు తణుకులో వ్యవసాయ రంగంపై సావనీరు ఆవిష్కరణ

తణుకు అర్బన్: వ్యవసాయ రంగంలో నెలకొన్న తీవ్రమైన సంక్షోభం, పరిష్కార మార్గాలపై వక్తల లోతైన ఉపన్యాసాలను ప్రచురించిన సావనీరును శుక్రవారం తణుకు సురాజ్యభవన్‌లో ఆవిష్కరించనున్నట్లు రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ ఆవిష్కరణ సభలో డీవీవీఎస్ వర్మ చేతులమీదుగా సావనీరును ఆవిష్కరించనున్నట్లు వివరించారు. రైతులు, కూలీలు, మేధావులు, ప్రజాతంత్రవాదులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా పుంతలో ముసలమ్మ ఆలయ వార్షికోత్సవాలు



అమ్మవారిని దర్శిస్తున్న వినాయక కల్యాణం గానామృతం బృందం

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్‌లోని సీతారాంపేట, కొబ్బరితోటలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద గురువారం పాతూరు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి మహిళా సత్సంగం సభ్యులచే శ్రీ వినాయక కల్యాణం గానామృతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. యువఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు రాజా త్రినాథ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని పట్టణ ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి సత్కారాలు జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సహవాసం

- 11వ వార్డులో వెంటాడుతున్న వెతలు
- కంపు కొడుతున్న కాలనీలు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- పట్టించుకోని అధికారులు



ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు



కాలనీలో అపారిశుద్ధ్యం నెలకొన్న దృశ్యం



సత్యవతినగరం కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న మట్టి రోడ్డు



ఖాళీ స్థలం వద్ద జంగిల్ క్లియర్స్ చేయాలని అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు



దానమ్మనగర్‌లో డ్రెయినేజీలు లేక ఇంకిపోతున్న మురుగునీరు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో వన్ టౌన్‌లో 11వ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుంది. రోజు రోజుకు టౌన్ విస్తరిస్తున్న ఆయా సమస్యలు అలానే అపరిష్కృతంగా మిగిలాయి. అస్తవ్యస్త డ్రెయినేజీలు, ఖాళీ స్థలాలు, ఇళ్ల మధ్యలోనే చెత్త చెదారాలు నిర్మించాల్సిన రోడ్లు, డ్రెయిన్‌లు, నీటి కాలుష్యం, పందులు బెడద, కుక్కల బెడద, విష జంతువులు బెడద ఇలా ఎన్నో సమస్యలు అ పరిష్కృతంగానే మిగిలాయి. ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం.

స్థానిక ప్రాంతాలు

వార్డు పరిధిలో మహాలక్ష్మీనగర్, సత్యవతినగర్, చెట్లు రోడ్డు, వినాయగుడి గుడి ఏరియా, దానమ్మ గుడి ఏరియా, ఏరియా ఆసుపత్రి ఏరియా, అమ్మా కాలనీ, ఇలా పలు అంతర్గత ప్రాంతాలు, రహదారులు నెలకొని ఉన్నాయి. ఈ ప్రాంతంలో జనాభా 3,500 పైనే ఉన్నారు.

అనేక అంతర్గత సీసీ రహదారులు నిర్మించాలి

వార్డులో పలు సీసీ రహదారులు ఉన్నప్పటికి అంతర్గత రహదారులు సుమారు 15 వరకు మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాల్సిన పరిస్థితి వార్డులో నెలకొని ఉంది. అంతర్గత రహదారులు సక్రమంగా లేకపోవడంతో ఎత్తు పల్లాలుగాను, గోతులు మయంతోను అస్తవ్యస్తంగా ఉన్నాయి. రహదారులు సరిగా లేకపోవడంతో పాదచారులతో పాటు ద్విచక్ర, ఇతర వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

స్లమ్స్ ఏరియాలు ఎక్కువే

అనేక ప్రాంతాలు స్లమ్ ఏరియాలో ఉండటం, అపరిశుభ్ర ఖాళీ స్థలాలు ఈ ఏరియాలో చాలా ఎక్కువ కానవస్తాయి. చెత్త కుప్పలు, వాటిలోని వ్యర్థాలు కోసం పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వార్డులో అనేక ప్రాంతాలలో డ్రెయినేజీలు ముందుకు కదలడం లేదు. దుర్గంధం వెదజల్లుతుంది. దానమ్మ గుడి ఏరియాలలో డ్రెయినేజీలు లేకపోవడంతో వాడకం మురుగు నీరు రోడ్లపైనే వదలివేస్తున్నారు. దీంతో అక్కడ పరిస్థితులు అస్తవ్యవస్తంగా మారాయి. అనేక ప్రాంతాలలో సీసీ డ్రెయినేజీలను అభివృద్ధి చేయడం, వాటిపై కల్వర్టులు నిర్మించాల్సి ఉంది.

ఖాళీ స్థలాలు అభివృద్ధి చేయాలి

ఖాళీ స్థలాలలో మురుగు నీటి నిల్వలు, చెత్త చెదారాలు, తుప్పలు అధికంగా కానవస్తున్నాయి. అధికారులు అక్కడ అక్కడ ఖాళీ స్థలాలలో జంగిల్ క్లియరన్స్ చేయాలని, బకాయిలు చెల్లించాలని బోర్డులు పెట్టారు. అయితే జంగిల్ క్లియర్‌న్స్ జరగడం లేదు. కదలని డ్రెయినేజీలతో పాటు అస్తవ్యస్త ఖాళీ స్థలాలు కారణంగా అనేక ప్రాంతాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ఉన్నాయి. దీంతో ప్రజలు ప్రతి రోజు దోమల బెడదతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

చెత్త చెదారాలు తొలగించడంలో ఇబ్బందులు

డ్రెయినేజీ వ్యర్థాలను తొలగించేందుకు, రోడ్లు శుభ్రం చేసేందుకు, ఖాళీ స్థలాలలో చెత్త చెదారాలను డంపింగ్ యార్డులకు పంపడంలో పారిశుద్ధ్య సిబ్బంది విఫలమవుతున్నారని స్థానికులు అంటున్నారు. సెక్రటరీలచే నిత్యం మోనటరింగ్ ఉన్నప్పటికి పూర్తిస్థాయిలో పరిసరాలు శుభ్రం కావడం లేదని, దీంతో తరుచుగా ఆయా ప్రాంతాలలో ప్రజలు విష జ్వరాలు పీడితులుగా ఉంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎక్కడ చూసిన డ్రెయిన్‌లు శుభ్రంగా లేకపోవడం, వార్డులలో అనేక ప్రాంతాలలో వ్యర్థాలు దర్శనం ఇవ్వడం పరిపాటిగా మారింది. వర్షకాలమైతే ఈ సమస్యలు మరింత జఠిలంగా ఉంటాయని వాపోతున్నారు.

స్ట్రీట్ లైట్లు సమస్యలు

అదే విధంగా పలు చోట్లు స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో స్థానికులు రాత్రి సమయాలలో తిరిగేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో విష జంతువులు అడ్డంపడటం, ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 35 సంవత్సరాల క్రితం ఈ వార్డు ఎలా ఉందో ఈ వార్డులో అనేక ప్రాంతాలు ఇప్పటికి మార్పురాలేదని స్థానికులు అంటున్నారు.

మంచినీటి కుళాయి సమస్యలు

దానమ్మ గుడి ఏరియాలో తాగునీటి కోసం ఇబ్బందులు ఉన్నాయి. వేసవి కాలం ఐతే నీటి కోసం కట కటలాడాల్సిన పరిస్తితి నెలకొని ఉంది. వేసవిలో స్థానిక ప్రజలు కోసం వాటర్ ట్యాంకర్లు పంపుతున్నారు. అవసరమైతే కొత్త పంపిణీ లైన్‌లు వేయడం, సక్రమంగా అందరికి నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని అక్కడ ప్రజలు కోరుతున్నారు.

11వ వార్డును అభివృద్ధి చేయాలి



వార్డు పరంగా విస్తీర్ణం ఎక్కువగా ఉంది. వార్డును ఎంతగానో అభివృద్ధి చేయాలి. 15 వరకు అంతర్గత మట్టి రహదారులను సీసీ రహదారులుగా నిర్మాంచాల్సి ఉంది. డ్రెయినేజీలు, ఖాళీ స్థలాలు అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు దుర్గంధం వెదజల్లుతున్నాయి. వర్షకాలం వస్తే ఈ కాలనీల్లో తిరగలేం. దోమల బెడద అధికంగా ఉంది. ఆయా సమస్యలు అన్ని పరిష్కరించాలి.

–నేదూరి గంగాధరరావు, మాజీ కౌన్సిలర్

డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి



దానమ్మనగర్‌లో ఏ ప్రాంతంలో ఎక్కడ చూసిన డ్రెయినేజీ వ్యవస్థ లేదు. వాడకం నీరు కోసం గోతులు తవ్వుకొని, ఆ గోయ్యిలోకి మురుగు నీరు పంపుతున్నాము. గొయ్యిలు నిండిపోవడం రోడ్డుపైకి వ్యర్థ నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి ఇంటి ముందు ఇలానే ఉంది. అంతేగాక తాగునీటి కోసం దానమ్మగుడి ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇబ్బందులను తొలగించాలి. –కట్టా నాగరాజు, దానమ్మనగర్ వాసి

సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి



తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓలు



తణుకు అర్బన్: సైన్స్ ఫెయిర్‌లో మాట్లాడుతున్న డీవైఈవో మురళిసత్యనారాయణ



ఇరగవరం: పాఠశాలలో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



అత్తిలి: బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి ఇంధనం తయారీ ప్రాజెక్టు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ఎంఈఓలు వి.హనుమ, పీఎంకేజ్యోతిలు అన్నారు. పట్టణంలోని కోడె వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాల కడకట్లలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. తాడేపల్లిగూడెం మండలంలోని 26 ఉన్నత పాఠశాలల వారు 78 ప్రదర్శనలు ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో తాడేపల్లిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్‌కే అల్మస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్ ఆరుగొలను విద్యార్థి కె.హేమంత్, ఎస్.సుధీర్‌లు గ్రూప్ విభాగంలో, ఉపాధ్యాయులు విభాగంలో ఎంఏడీఓ ఉన్నత పాఠశాలకు చెందిన బి.అరుణలు అర్హత పొంది జిల్లా స్థాయికి చేరుకున్నారు. నోడల్ హెచ్ఎంగా ఎస్ఎస్ శ్రీనివాస్, నోడల్ టీచర్స్ డి.మల్లికార్జునరావు, సీహెచ్‌బీ రవికుమార్‌లు న్యాయ నిర్ణతలుగాను, ఎం.శ్రీనివాసరావు, పి.పార్వతిలు ప్రదర్శనలకు సహకరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలి...

తణుకు అర్బన్: విద్యతోపాటు సైన్స్ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు చొరవ చూపించాలని డీవైఈవో డి.మురళిసత్యనారాయణ అన్నారు. జిల్లా సైన్స్ ఫెయిర్ సన్నద్ధతలో భాగంగా తణుకు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజ్ఞానిక దృక్పథం, శాస్త్రీయ పరిశీలనను పెంపొందించుకుని సైన్స్ ప్రదర్శనలపట్ల మక్కువగా ఉండాలన్నారు.

55 సైన్స్ ప్రాజెక్టులు...

తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో తణుకు మండలంలోని 11 ఉన్నత పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి 55 ప్రాజెక్టులు ప్రదర్శనలో నిలిచాయి. వ్యక్తిగతం, గ్రూపు, టీచర్ విభాగాల్లో నిర్వహించిన ఈ ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు మూడు ప్రదర్శనలను జడ్జిలుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు పి.సూర్యనారాయణరెడ్డి, డి.తారాకృష్ణ, వై.రవీంద్ర ఎంపిక చేశారు. గ్రూపు విభాగంలో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు ఎండీ ఫాజిల్ జహ్రా, భార్గవి, గైడ్ టీచర్‌గా మాధవీలత, వ్యక్తిగత విభాగంలో తణుకు జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల విద్యార్థులు కత్తుల యువల్ తేజ, వాసా సత్యనారాయణ, గైడ్ టీచర్ దాసి లావణ్య, టీచర్ విభాగంలో తణుకు మండలం దువ్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి.రాధాకృష్ణ రూపొందించిన ప్రదర్శనలు విజేతలుగా నిలిచి జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక అయినట్లు సైన్స్ ఫెయిర్ కన్వీనర్ అక్కింశెట్టి రాంబాబు తెలిపారు.

ఘనంగా నిర్వహించిన విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు

ఇరగవరం: మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. వ్యక్తిగత, గ్రూపు, టీచర్ విభాగాలకు సంబంధించి లెక్కలు, ఇంజనీరింగ్, బయోసైన్స్‌లకు సంబంధించి వ్యక్తిగత విభాగంలో బహుపదాల కారకం, విభజనలకు సంబంధించి బి.గౌతమ్ నాగ ప్రణయ్ ప్రదర్శనలు ఇచ్చారు. గ్రూపు విభాగంలో ఆటోమెటిక్ సోలార్ స్ట్రీట్ లైట్‌కు సంబంధించి కె.గుణ షణ్ముఖి, కె.సౌమ్య శ్రీ వెంకట లక్ష్మిలు ప్రదర్శన ఇచ్చారు. టీచర్ విభాగంలో వాటర్, ఎయిర్ పొల్యూషన్‌పై ఈస్ట్ విప్పర్రు ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు ప్రదర్శన ఇచ్చారు.ఈ ప్రదర్శనలు పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు వెలికితీయడానికి సైన్సు ఫెయిర్‌లు దోహదపడతాయి

అత్తిలి: విద్యార్థులల్లో దాగియున్న నైపుణ్యాలను వెలికితీయడానికి సైన్సుఫెయిర్‌లు దోహదపడతాయని మండల విద్యాశాఖాధికారి–2 ఎంవీఎల్‌కే ప్రసాద్ అన్నారు. గురువారం అత్తిలి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్సుఫెయిర్ నిర్వహించారు. ఈపోటీలలో మండలంలోగల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 38 విద్యార్థుల ప్రాజెక్టులు, రెండు ఉపాధ్యాయ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలో రెండు ప్రాజెక్టులను ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. వ్యక్తిగత పోటీలలో అత్తిలి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని టి లూథర్‌బ్లెస్సీ రూపొందించిన శాటిలైట్ కమ్యూనికేషన్ ప్రాజెక్టులో శాటిలైట్ నుంచి సిగ్నల్స్ ఎలా వస్తాయో తెలిపే ప్రదర్శన. గ్రూపు విభాగంలో అత్తిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు బి ఆశపరాజు, ఎన్ సుకుమార్, డి హర్షనాయుడు రూపొందించిన మనం వాడే ప్లాస్టిక్ వ్యర్థాలను మండించి దానినుండి వచ్చే గ్యాస్‌ను కండెన్సేషన్‌చేసి ద్రవరూపంలో మార్చి తద్వారా ఇంధనంగా ఉపయోగించే వర్కింగ్ మోడల్ ప్రదర్శన జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైందని ఎంఈవో ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దు



ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను సీజ్ చేసిన మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తక్కువ మైక్రాన్స్ ఉన్న ప్లాస్టిక్ కవరులను వినియోగించవద్దు అని వాటిని ఉపయోగిస్తే ప్రజా ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుందని మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు అన్నారు. పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ ఎస్‌వీ శ్రీమన్నారాయణ, శానిటరీ ఇనస్పెక్టర్ సోమేశ్వరరావు, శానిటరీ సెక్రటరీలు ఆధ్వర్యంలో గురువారం టూ టౌన్‌లోని పలు ప్రాంతాలలో ప్లాస్టిక్ కవర్స్ వినియోగిస్తున్న పలు వ్యాపార సంస్థలపై దాడులు చేశారు. ఈ దాడులలో 25 కేజీల తక్కువ మైక్రాన్స్ ఉన్న ప్లాస్టిక్ కవర్స్‌ను సీజ్ చేశారు. యాజమానులకు రూ.నాలుగు వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమకు సహకరించాలని, ప్లాస్టిక్ వాడాకాన్ని ఆపాలని, గడ్డ సంచులు, గన్నీ బ్యాగ్‌లు తీసుకువెళ్లాలని కోరారు. వ్యాపారస్తులు కూడా ప్రజలకు గుడ్డ సంచులు, గన్నీబ్యాగ్స్ అందుబాటులో ఉంచాలన్నారు.

95 మందికి ఉచిత రక్త పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లయన్స్ డి.వి.పి.విశ్వేశ్వరరావు ఆర్థిక సహాయంతో గురువారం స్థానిక కడకట్ల జనతా ట్రస్ట్ ఆవరణలో ఉచిత షుగర్ రక్త పరీక్షలు జరిగాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ యార్డు బ్రాంచ్ మేనేజర్ జి.జవహర్ లాల్ రక్త పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. 95 మందికి రక్త పరీక్షలు చేశారు. చిన్నం జగదీష్, బాపయ్య శర్మ, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు మామిడి దాన వర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ కార్మికుల సమావేశం పట్టణంలో గురువారం బి.దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో దాన వరప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హమాలి, ఆటో, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు జరగాలన్నారు. ఏడు నెలలు కావస్తున్న ఒక్క పథకం కూడా అమలు చేయాలేదని విమర్శించారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలను అరికట్టాలని, క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమం చంద్రశేఖర్, శ్రీనివాస్, వాసు, పాండురంగారావు, రాము, వెంకటేశ్వరరావు, ఆదినారాయన, నాని, తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: అదనపు వరకట్నం కోసం వేధిస్తున్న భర్త, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేవీఎన్.ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెల్లమిల్లి స్టేజ్ వద్ద నివాసం ఉంటున్న వెలగల నాగవెంకట సూర్యప్రసాద్‌రెడ్డి – వందన సత్యప్రియలకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు కలరు. చెడు వ్యసనాలకు బానిసైన ప్రసాద్‌రెడ్డి అదనపు కట్నం రూ.5లక్షలు తేవాలంటూ భార్య సత్యప్రియను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఇందుకు ప్రసాద్‌రెడ్డి తల్లిదండ్రులు సహకరిస్తున్నారని బాధితురాలు సత్యప్రియ గురువారం రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఎస్‌ఎంసీలు పాఠశాల అభివృద్ధికి పాటుపడాలి



అత్తిలిలో ఎస్ఎంసీ చైర్మన్‌లకు శిక్షణ ఇస్తున్న రిసోర్సుపర్సన్ శ్రీనివాసరావు

అత్తిలి: పాఠశాల విద్యా కమిటీలు తమ కర్తవ్య విధులను నిర్వహించి పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని ఎంఈవో–2 ఎంవీఎల్‌కే ప్రసాద్ అన్నారు. గురువారం అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్స్, ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యామమాన్య కమిటీ విధులు, బాధ్యతలు, నిర్వహణ, అభివృద్ధి ప్రణాళిక, ప్రజల భాగస్వామ్యం, సమకాలీన సమస్యలపై రిసోర్సు పర్సన్‌లు బి శ్రీనివాసరావు, ఏ సూర్యనారాయణ, జి సుధాకర్‌లు వివరించారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్‌లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మండల విద్యాశాఖ అధికారులు వి.హనుమ, పీఎంకే జ్యోతిలు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ సభ్యులకు పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటు, విధులు, బాధ్యతలపై గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాల పరిధిలో బడి వయస్సు కలిగిన వారందరూ 100 శాతం బడిలో ఉండాలన్నారు. ఎస్ఎంసీ సభ్యులు విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగాను, బడి ఆవరణలో కూరగాయలు పెంచడంలో ప్రోత్సాహం, చెత్త బుట్టలు వాడే పద్ధతులు, వ్యక్తిగత పరిశుభ్రతపై పిల్లలకు, వారి తల్లిదండ్రులకు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనంను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు, ఆర్‌పీలు అద్దంకి వీరాజు, జి.రఘు, శ్రీనివాస్, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో మెయిన్ రోడ్డు, రైల్వే ఫీడర్, పాతూరు సబ్ స్టేషన్ పరిధిలో మహాలక్ష్మి నగర్ ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 3వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. మెయిన్ రోడ్డు, నల్లజర్ల రోడ్డు, పోలీస్ క్వార్టర్స్, శేషమహల్ సెంటర్, ఓవర్‌బ్రిడ్జి డౌన్, కోతిబొమ్మ సెంటర్, స్టేషన్ రోడ్డు, భూపాల్ నగర్, మహాలక్ష్మినగర్, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, సత్యవతి నగర్ రోడ్డు, చెట్లు రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు ముఖ్యం

తణుకు అర్బన్: భావిభారత పౌరులను తయారు చేసే క్రమంలోను, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తల్లిదండ్రులుగా ఉన్న పాఠశాల యాజమాన్య కమిటీలు (ఎస్ఎంసీ) తమ వంతుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సహకారం అందజేయాలని డీవైఈవో డి.మురళి సత్యనారాయణ అన్నారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎస్ఎంసీ చైర్‌పర్సన్స్, ప్రధానోపాధ్యాయుల ఒకరోజు శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో నిర్వహించే ఎస్ఎంసీ సమావేశాల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఎంఈవో వి.హైమావతి మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యనందించడంలో సమర్థవంతమైన పాఠశాల ప్రణాళిక తయారు చేసుకునేందుకు ఎస్ఎంసీ, హెచ్‌ఎంలు ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు ఎం.హరికృష్ణ, పి.గోపాలకృష్ణ, కె.నాగరాజు, ఎస్.శివప్రసాదరాజు, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌లు, సీఆర్పీలు పాల్గొన్నారు.